క్లుప్తంగా

వార్డులో సమస్యలన్నీ పరిష్కరిస్తా

కనిగిరి రూరల్: దశల వారీగా వార్డుల్లోని సమస్యలు పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డు మంగలి మాన్యం, బీసీ కాలనీలో చైర్మన్ గఫార్, కౌన్సిలర్ సయ్యద్ రిజ్వాన ఖాలక్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు పారిశుద్ధ్యం, నీరు, వీధిలైట్లు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర సమస్యలను చైర్మన్ గఫార్‌కు విన్నవించారు. తక్షణ చర్యగా కొండ కింద కాలనీలో ఉన్న చిల్ల, పిచ్చి చెట్లను తొలగించారు. ప్రధాన కాలువలో పూడిక తీత కార్యక్రమాలు నిర్వహించారు. శానిటరీ సెక్రటరీ నాగజ్యోతి, దాసరి మురళీకృష్ణ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

హనుమంతునిపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి సచివాలయాన్ని ఎంపీడీఓ జీవీ కృష్ణారావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది విధి నిర్వహణ రికార్డులను, ప్రభుత్వ సర్వీస్ రికార్డులను, సంక్షేమ పథకాలు, రేషన్‌కార్డులు, పింఛన్ లబ్ధిదారుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

55 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా గురువారం హాజీపురంలో నిర్వహించిన వైద్య క్యాంప్‌లో 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, వైద్య సిబ్బంది, 104 వాహణ వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పూజారి ఆకస్మిక మృతి బాధాకరం

సీఎస్‌పురం: ఆలయ పూజారి ఆకస్మిక మృతి బాధాకరమని నారాయణస్వామి ఆలయం, వీరభద్ర వీరాంజనేయస్వామి ఆలయాల ట్రస్టుబోర్డు చైర్మన్లు దుగ్గిరెడ్డి జయరెడ్డి, మూరం మొరార్జి అన్నారు. మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ పూజారి మాంకాల ప్రభాకర శర్మ గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, వీరభద్ర వీరాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ మూరం మొరార్జి గురువారం పూజారి ప్రభాకరశర్మ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. మట్టిఖర్చుల నిమిత్తం మృతుని భార్య రోజమ్మకు రూ.10 వేలు నగదు అందజేశారు. మృతునికి నివాళులర్పించిన వారిలో నల్లమడుగుల ఉప సర్పంచ్ ముడుమాల నారాయణరెడ్డి, నారాయణస్వామి ఆలయ పూజారులు మాంకాల సత్యనారాయణ, ప్రసాదశర్మ ఉన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి యూటీఎఫ్ ఆర్థికసాయం


శ్రీరాములు కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న సంఘ నాయకులు

టంగుటూరు: మండలంలోని బుడబుక్కల పాలెం ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పారా శ్రీరాములు (58) ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కాట్రగడ్డ రమేష్ అధ్వర్యంలో సంఘం తరపున శ్రీరాములు భార్య రాజ్యలక్ష్మికి గురువారం రూ.1,50,000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కొణికి పూర్ణశ్రీ, డి.శ్రీధర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న దివ్యాంగుల శిబిరం

ఉలవపాడు: దివ్యాంగుల అసెస్‌మెంట్ శిబిరంలో ఈ నెల 7న కావలి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరుగుతుందని ఉలవపాడు ఐఈఆర్‌పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు క్యాంపులో వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా పరికరాలు అందచేస్తారని తెలిపారు. సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో జరిగే శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, రైస్ కార్డు, మెడికల్ సర్టిఫికెట్, 2 ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- పొన్నలూరులో కొత్త పింఛన్ల పంపిణీ


పొన్నలూరులో కొత్త పింఛన్లు అందజేస్తున్న వరికూటి అశోక్‌బాబు

పొన్నలూరు: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడోసారి పింఛన్ నగదు పెంచి రాష్ట్రంలోని అవ్వాతాతలకు అండగా నిలిచారన్నారు. పింఛన్ సొమ్ము రూ.2,750కి పెరగడంతో గ్రామాల్లోని అవ్వాతాతలు, పింఛన్‌దారుల మొహాల్లో సంతోషం కనిపిస్తోందన్నారు. గత నాలుగు రోజుల నుంచి వాడవాడాలా పండుగ వాతావరణంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏడాదికి ఒక్కసారి జన్మభూమి గ్రామసభలు నిర్వహించి అరకొరగా టీడీపీ కార్యకర్తలకే కొత్తగా పింఛన్లు ఇచ్చేవారన్నారు. కానీ, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా దరఖాస్తు చేసుకున్న వెంటనే అర్హులందరికీ సచివాలయాల ద్వారా పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 62 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలంలో-173, కొండపిలో-184, మర్రిపూడి-135, సింగరాయకొండ-287, టంగుటూరు-351, జరుగుమల్లి-199 చొప్పున కొత్త పింఛన్లు మంజూరయ్యాయని అశోక్‌బాబు వివరించారు. గ్రామాల్లోని పేదలకు సొంతింటి కల నెరవేరాలన్నా, ఉన్నత చదువులు చదవాలన్నా, ఆర్థిక స్థితిగతులు మారాలన్నా.. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో రత్నజ్యోతి, పల్లపోలు బాలకోటిరెడ్డి, సిరిగిరి గోపాల్‌రెడ్డి, పిల్లి తిరుపతిరెడ్డి, మన్నెం రవణయ్య, చేవూరి పద్మనాభరెడ్డి, గ్రామ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పేదవాడి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జరుగుమల్లి (సింగరాయకొండ): పేదవాడి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. జరుగుమల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బెల్లం నిర్మల అధ్యక్షతన గురువారం కొత్తగా మంజూరైన వారికి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అశోక్‌బాబు పాల్గొని మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు పచ్చచొక్కా మద్దతుదారులకే పింఛన్లు ఇచ్చారన్నారు. నేడు సీఎం జగనన్న అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా పెన్షన్లు అందిస్తున్నారని తెలిపారు. 199 కొత్త పింఛన్లను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు అశోక్‌బాబు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రామకృష్ణ, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాతంగి చంద్రలీల, వైస్ ఎంపీపీ పులి బిక్షాలు, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, సర్పంచ్ పున్నారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలి


ఎంపీడీఓ ఈశ్వరమ్మను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సీఎస్‌పురం: వైఎస్సార్ సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించాలని జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి ప్రతినిధులు అవినాష్, అనుదీప్‌లు గురువారం సీఎస్‌పురం వచ్చారు. మండలంలో పట్టభద్రుల ఓట్లు ఎన్ని ఉన్నాయి, ఇంకా ఎవరైనా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉందా అనే దానిపై సమీక్షించారు. పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలను ఆయా పంచాయితీలలోని వైఎస్సార్ సీపీ నాయకులకు అందజేశారు. పంచాయితీలలోని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసీ లు పట్టభద్రుల ఓటర్ల ను కలిసి శ్యాంప్రసాద్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అటేలయ్య, సర్పంచ్‌ల సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల చిరంజీవి, మండల అధ్యక్షుడు చెరుకుపల్లి రాధాకృష్ణ, ఇతర నేతలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


దివ్యాంగురాలికి ట్రై సైకిల్ అందజేస్తున్న అశోక్‌బాబు

పొన్నలూరు: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విభిన్న ప్రతిభావంతురాలు పల్లపోతు నవ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ దివ్యాంగులకు పూర్తి స్థాయిలో పింఛన్లు, రుణాలు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, జైపూర్ బూట్లు, మూడు చక్రాల సైకిళ్లు అందిస్తూ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు లెర్నింగ్ ద్వారా విద్యనందిస్తూ వారి అభివృద్ధికి మార్గం చూపిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం దివ్యాంగుల గురించి పట్టించుకోకపోవడంతో సరైన తోడ్పాటు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కానీ, నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి దివ్యాంగుల సంక్షేమానికి కావాల్సిన పనులు చేస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, ఎంఈవో రవిచంద్రబాబు, ఎంపీడీవో రత్నజ్యోతి, ఐఈఆర్టీలు మల్లికార్జునరావు, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ పింఛన్ పెంపు సంబరాలు

సీఎస్‌పురం: వైఎస్సార్ పింఛన్ పెంపు సంబరాలు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి నూతనంగా 208 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేసేందుకు సంబరాలు కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ అధికారులు, లబ్ధిదారులు సంబరాల్లో పాల్గొనాలన్నారు.

చంద్రబాబువి నీచ రాజకీయాలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు

సీఎస్‌పురం: చంద్రబాబు రాజకీయ మనుగడ కోసం చీప్ ట్రిక్స్ అమలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడని జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రోడ్‌షోలతో 11 మంది ప్రాణాలను చంద్రబాబు పొట్టనపెట్టుకున్నారన్నారు. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా రోడ్‌షోలు, రోడ్లపై బహిరంగసభలను నిషేధిస్తూ అన్ని పార్టీలకు వర్తించేలా ప్రభుత్వం జీఓ జారీ చేస్తే దాన్ని కూడా రాజకీయం చేయాలని చూడటం దారుణమన్నారు. ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అటేలయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు చెరుకుపల్లి రాధాకృష్ణారెడ్డి, సంగిశెట్టి వాసు, బత్తుల దేవరాజు తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై రైతులకు పైపులు

పెట్లూరు (కొండపి): వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు పీవీసీ పైపులు అందిస్తోందని మండల వ్యవసాయ శాఖాధికారి వి.రాము తెలిపారు. మండలంలోని పెట్లూరు, కట్టావారిపాలెం గ్రామాల్లో ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం కింద మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం రైతులకు గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి రాము మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువు ఆయకట్టు పరిధిలోని రైతులు 10 నుంచి 12 మంది కలిసి గ్రూపుగా ఏర్పడి గ్రామస్థాయిలో రైతుల అవసరాలను బట్టి కావాల్సిన తీర్మానాలు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 50 శాతం రాయితీతో పీవీసీ పైపులు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెట్లూరు, కొండపి గ్రామ వ్యవసాయ సహాయకులు పద్మ, హర్షిక, రైతులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో నడిరోడ్డుపై యువకుడు వీరంగం


రోడ్డుపై పడుకున్న యువకుడు

కొండపి: మద్యం సేవించిన ఓ యువకుడు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుకు అడ్డంగా పడుకుని వీరంగం చేయడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. స్థానిక జాళ్లపాలెం రోడ్డులో చెరువుకట్ట వద్ద నివసిస్తున్న యువకుడు గురువారం సాయంత్రం పూటుగా మద్యం సేవించాడు. అనంతరం బస్టాండ్ సెంటర్‌కు వచ్చి నానా యాగి చేస్తూ రోడ్డుకు అడ్డంగా పడుకుని దొర్లుతూ రచ్చచేశాడు. వాహన చోదకులు సడన్‌గా బ్రేక్‌లు వేసి ఆందోళనకు గురయ్యారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే యువకుడు నానా యాగీ చేస్తున్నా.. పోలీసులు అటువైపుగా కన్నెత్తి చూడలేదు. కొద్దిసేపటి తర్వాత ఆ యువకుడి బంధువులు వచ్చి రిక్షాపై ఇంటికి తరలించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

రూ. 60 కోట్లతో ఉపాధి పనులకు ప్రతిపాదనలు


మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం

కనిగిరి రూరల్: ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కల్గిన ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏడు మండలాల ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు బ్యాంక్ లింక్, ఆధార్ కార్డు అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి కలిగే విధంగా గ్రామాల్లో పనుల రూపకల్పన చేశారు. ఏపీడీ పి సుజాత మాట్లాడుతూ నెలాఖరులోపు అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులను ప్రారంభించాలన్నారు. పనుల ప్రారంభంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లస్టర్ పరిధిలోని 7 మండలాల్లో రూ.60 కోట్లతో 2023-24 సంవత్సరానికి ఉపాధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏపీఓలు షారూన్ పుష్పరాణి, వెంకటేశ్వర్లు, నాగరాజు, రాంబాబు, మాల్యాద్రి, మాచర్ల, సుబ్బారావు, ఈసీలు, టీఏలు పాల్గొన్నారు.

అర్హులందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక


లక్ష్మీనరసాపురంలో పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నాయకులు

పామూరు: అర్హులందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక వచ్చేలా చూస్తామని ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామ సచివాలయంలో గురువారం సర్పంచ్ మన్నేపల్లి విజయ్‌శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ, కులం, మతాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. పెన్షన్‌ను తొలగిస్తున్నారనేది అపోహ మాత్రమేనని, అర్హులందరికీ పెన్షన్ ఉంటుందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాత, కోఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎండీకి సన్మానం


సీఎండీ ని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కనిగిరి రూరల్: ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ పద్మ జనార్దన్‌రెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో కలిశారు. తిరుపతి నుంచి యర్రగొండపాలెం వెళ్తూ మార్గమధ్యంలో కనిగిరిలోని అల్పాహార విందుకు ఆగిన సీఎం పద్మ జనార్దన్‌రెడ్డిని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డిలు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కనిగిరి పట్టణంలో మూడు కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని, కాశీపురం, మాచవరం గ్రామాల్లో 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించాలని చైర్మన్ గఫార్ సీఎండీకి వినతి పత్రం అందచేశారు. అనంతరం ఎస్ఈ కేవీజీ సత్యాన్నారాయణ, ఈఈ నాగేశ్వరరావు, విద్యుత్ సిబ్బందితో సీఎండీ మాట్లాడారు. తదనంతరం విద్యుత్ అధికారులు సీఎండీ పద్మ జనార్దన్‌రెడ్డిని గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు శ్రీహరిరెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, రాజశేఖర్, బాలాజిరెడ్డి, వెంకటయ్య నాయుడు, లతీఫ్ పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యే రాక

వెలిగండ్ల: ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఈనెల 7వ తేదీన ఉదయం 9 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామన మహాలక్ష్మి అధ్యక్షతన నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ చేసేందుకు వస్తున్నట్లు ఎంపీడీఓ టి.సుకుమార్ తెలిపారు. మండలంలో మొత్తం 118 పింఛన్లు నూతనంగా మంజూరయ్యాయన్నారు. ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, సచివాలయ పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు విధిగా హాజరుకావాలని కోరారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

పీసీపల్లి: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంపీటీసీ బండారు రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని పెదఅలవలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పీసీపల్లి కమిటీ అధ్యక్షుడు చెన్నుపాటి వెంకటేశ్వర్లు, వీఆర్ఓ అమానుల్లా కాను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు


పాలేటిపాడులో పొగాకును పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

టంగుటూరు: పొగాకు రైతులు సస్యరక్షణ చర్యలు, సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందుతారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలోని పాలేటిపాడు గ్రామంలో సస్యరక్షణ చర్యలపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి మాట్లాడుతూ పురుగు మందులు వాడినప్పుడు తప్పనిసరిగా పూర్తి శరీరం కప్పి ఉండేలా దుస్తులు ధరించాలని సూచించారు. బోర్డు వారు సిఫార్సు చేసిన పురుగు మందులు, ఎరువులను తగిన మోతాదులో ఉపయోగించాలన్నారు. రైతులకు ఏమైనా సందేహాలుంటే వెంటనే బోర్డు వారినిగానీ, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలనుగానీ సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్జీవో సునీల్‌కుమార్, క్షేత్రాధికారి వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.